RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం

AKSHARA VEDAM TELUGU DAILY

Published at Karimnagar circulated in : Telangana | సంచిక : 366 | సంపుటి : 02 | గురువారం 27-11-2025 | పేజీలు -8 | వెల: రూ. 05.00

## విలేకరులు కావలెను

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ -పొన్నం ప్రసాద్ గౌడ్

9666992524

# ఎయిరో స్పేస్..డిఫెన్స్ హబ్‌గా హైదరాబాద్

## తెలంగాణ అభివృద్ధిలో మరో మైలురాయి

- హైదరాబాద్ దేశంలోనే ప్రధాన ఎయిరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా మారింది
- బెంగుళూరు-హైదరాబాద్ నగరాలను డిఫెన్స్, ఎయిరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలి
- ఈ సెంటర్ ద్వారా వెయ్యి మందికిపైగా నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లకు ఉపాధి లభిస్తుంది
- సాఫ్రస్ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ

**హైదరాబాద్ / శంషాబాద్ నవంబర్ 26 అక్షర వేదం**
సాఫ్రన్ సంస్థ తన ఎయిరోస్పేస్ ఫెసిలిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పడం తెలంగాణ అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్‌కు చెందిన సాఫ్రన్ సంస్థ, ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఇండియా బుధవారం హైదరాబాద్ జీఎంఆర్ ఎయిరోపార్క్ (ఎస్‌ఈజెడ్)లో నెలకొల్పిన ఫెసిలిటీ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ప్రధాని మోడీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ..హైదరాబాద్ దేశంలోనే ప్రధాన ఎయిరోస్పేస్, డిఫెన్స్

-మిగతా 2 లో





## రేవంత్ రియల్ ఎస్టేట్ కోసమే.. జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనం

- పాలన వికేంద్రీకరణ కేసీఆర్ పాలసీ.. నేడు రివర్స్
- రాహుల్, రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

**వరంగల్, నవంబర్ 26 అక్షర వేదం**
రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి జీహెచ్ఎంసీలో శివారు మున్సిపాలిటీలను విలీనం చేయాలని చూస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ప్రజల గడప వద్దకు ప్రభుత్వం చేరాలని.. కేసీఆర్ పాలనను వికేంద్రీకరిస్తే.. అధికారం పేరుతో దోచుకోవడాన్నే రేవంత్‌రెడ్డి పాలసీగా ఎంచుకున్నారని నిప్పులు చెరిగారు. పారిశ్రామిక వాడలకు చెందిన భూములను అప్పనంగా తన వందిమాగదులకు కట్టబెట్టేందుకు రేవంత్‌రెడ్డి స్కెచ్ వేశారని ధ్వజమెత్తారు. అపార్ట్‌మెంట్లు, మాల్స్ కోసం పరిశ్రమల భూములను కేటాయిస్తారా? అని ప్రశ్నించారు. ప్రస్తుత, భవిష్యత్తు అవసరాల కోసం వినియోగించాల్సిన ప్రభుత్వ భూములపై కన్నేసి..

-మిగతా 2 లో




## ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగం

- ఢిల్లీ సంవిధాన్ సదన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం
- 75వ భారత రాజ్యాంగ దినోత్సవ సభ
- ఆయా భాషల్లో ప్రచురించిన రాజ్యాంగ డిజిటల్ వర్షన్ విడుదల

**న్యూఢిల్లీ**
భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్ వేదికగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేతృత్వంలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి కీలక ప్రసంగం చేశారు. కార్యక్రమానికి హాజరైన వారితో భారత రాజ్యాంగ ప్రవేశికను చదివించారు. తెలుగు, ఒడియా, అస్సామీస్, కాశ్మీరీ, బోడో, పంజాబీ, నేపాలీ, మరాఠీ, మళయాలం భాషల్లో ప్రచురించిన భారత రాజ్యాంగ గ్రంథం డిజిటల్ వర్షన్‌లను ఈ సందర్భంగా రాష్ట్రపతి విడుదల చేశారు. భారత్ కే సంవిధాన్ మే కళా ఔర్ కాలిగ్రఫీ శీర్షికతో ఒక స్మారక బుక్‌లెట్‌ను రిలీజ్ చేశారు.

-మిగతా 2 లో



## ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నాడా?

- జైల్లో మృతి చెందినట్టు వార్తలతో కలకలం
- చూపించాలంటూ మద్దతుదారుల ఆందోళనలు
- ఆయన్ను కలవడానికి వచ్చిన కుటుంబసభ్యులపై ఖాకీ జులుం

**ఇస్లామాబాద్**
జైలు శిక్ష అనుభవిస్తున్న పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌ను చూపించాలంటూ ఆయన మద్దతుదారులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. కుటుంబ సభ్యులు సైతం ఆయన్ని కలవడానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి పెద్ద ఎత్తున నిరసనలు కూడా చేపట్టినట్టు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం నడుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. దీనంతటికీ ఇమ్రాన్ ఖాన్ జైల్లో మృతి చెందారనే వార్తలు బయటకు రావడమే కారణమని తెలుస్తోంది. కాగా, 2023 ఆగస్టు నుంచి ఇమ్రాన్ ఖాన్ అడియాలా జైలులో ఉన్నారు. అయితే, ఆయన్ను హతమార్చినట్టు సోషల్ మీడియాలో వార్తలు ప్రచారమయ్యాయి. దీనికి సంబంధించిన వార్తను బలూచిస్తాన్ విదేశాంగ శాఖ తమ ఎక్స్ ఖాతా లో పోస్ట్ చేసింది. పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసీమ్ మునీర్, నిఘా విభాగం ఐఎస్ఐ కలిసి ఆయన్ను హతమార్చినట్టు వార్తలు వస్తున్నా యని అందులో రాసుకొచ్చింది. ఇంకా పలు మీడి యా సంస్థలు కూడా దీనికి సంబంధించి వార్తలను ప్రచురించినట్టు సామాజిక మాధ్యమాల్లో పలువురు పోస్ట్ చేశారు. మరోవైపు ఆయన అనారోగ్యంతోనూ మరణించి ఉండొచ్చనే వాదనలు కూడా వినిపిస్తు న్నాయి. కానీ, ఇప్పటి వరకు వీటిని ధ్రువీకరించేలా అధికారికంగా ఒక్క ఆధారమూ బయటకు రాలేదు. ఈ వార్తల నేపథ్యంలో

-మిగతా 2 లో


## నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

### పారదర్శకంగా సర్పంచ్ ఎన్నికలు

- మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా అమలు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు
- ఎస్ఈసీ రాణికుముదిని

**హైదరాబాద్ నవంబర్ 26 అక్షర వేదం**
గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై ఆమె బుధవారం జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, సీనియర్ అధికారులతో హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా

-మిగతా 2 లో





## రాజ్యాంగ విధులే ప్రజాస్వామ్యానికి పునాదులు

- రాజ్యాంగ దినోత్సవ వేళ ప్రజలకు మోడీ బహిరంగ లేఖ

**న్యూఢిల్లీ నవంబర్ 26 అక్షర వేదం**
: పౌరుల రాజ్యాంగ విధులే బలమైన ప్రజాస్వామ్యానికి పునాదులని ప్రధాని మోడీ అన్నారు. ఈ రాజ్యాంగ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని దేశ పౌరులకు ఆయన పిలుపు నిచ్చారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు సందేశమిస్తూ ప్రధాని మోడీ ఓ బహిరంగ లేఖను విడుదల చేశారు.

-మిగతా 2 లో




## సంక్షోభాలను అధిగమిస్తేనే విజయాలు

- విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరగాలి
- ప్రతి పౌరుడూ విలువలు కాపాడాలి
- మాక్ అసెంబ్లీలో సీఎం చంద్రబాబు

**అమరావతి నవంబర్ 26 అక్షర వేదం**
సంక్షోభాలను అధిగమించగలిగితే విజయావకాశాలు పెరుగుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. విద్యార్థులు కూడా మంచి, చెడుపై ఆలోచించే శక్తిని పెంచుకోవాలన్నారు. సంవిధాన్ దివస్- రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో ఎపి పాఠశాల శాసనసభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులతో నిర్వహించిన మాక్ డ్రిల్ను పరిశీలించారు. విద్యార్థులు నిర్వహించిన తీరును పరిశీలించిన ఆయన వారిని

-మిగతా 2 లో



## కీలక బిల్లులపై చర్చించేనా?

- డిసెంబర్ 1 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు
- హడావిడిగా ఆమోదం పొందేందుకుమోడీ ప్రభుత్వ యత్నాలు

**న్యూఢిల్లీ**
పార్లమెంట్ శీతాకాల సమావేశాలు వచ్చే నెల 1వ తేదీన ప్రారంభం కాబోతున్నాయి. 19వ తేదీ వరకూ ఇవి కొనసాగుతాయి. సెలవులు పోను కేవలం పది హేను రోజులు మాత్రమే జరిగే ఈ సమావేశాలలో తొమ్మిది కీలక బిల్లులకు ఆమోదం పొందాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో అణు విద్యుత్, మార్కెట్లు, ఉన్నత విద్య, మౌలిక సదుపాయాలకు సంబంధించిన బిల్లులు ప్రధానమైనవి. స్టాక్ మార్కెట్, కార్పొరేట్ చట్టం, బీమాకు సంబంధించిన బిల్లులు కూడా వీటిలో ఉన్నాయి. సమావేశాలు కేవలం పదిహేను రోజులు మాత్రమే జరుగుతుండడంతో ఇలాంటి ముఖ్యమైన బిల్లులపై చర్చకు పెద్దగా సమయం ఉండకపోవచ్చు. లోతైన చర్చకు అవకాశం ఇవ్వకుండానే వాటిని హడావిడిగా ఆమోదింపజేసుకోవడం ప్రభుత్వ ఉద్దేశంగా కన్పిస్తోంది.

-మిగతా 2 లో

# రేవంత్‌రెడ్డి మిషన్ కమీషన్

## రూ.50 వేల కోట్ల విద్యుత్ స్కాం

- ప్రయివేటీకరణ కోసమే కొత్త డిస్కం
- బీజేపీతో కాంగ్రెస్ కుమ్మక్కు..కాదంటే విచారణ జరపండి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

**హైదరాబాద్ నవంబర్ 26 అక్షర వేదం**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిషన్ కమీషన్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. మొన్న దేశంలోనే పెద్ద భూకుంభకోణాన్ని బీఆర్ఎస్ బయటపెట్టిందన్నారు. ఇప్పుడు రూ.50 వేల కోట్ల విద్యుత్ కుంభకోణానికి రేవంత్ సర్కారు రూపకల్పన చేసిందని చెప్పారు. ఆధారాలతో సహా బయటపెడుతున్నామని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.50 వేల కోట్ల విద్యుత్ కుంభకోణంలో దాదాపు 30 నుంచి 40 శాతం కమీషన్లు దండుకోబోతున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎప్పుడు ఏది మాట్లాడినా, ఏం చేసినా.. ఏది చెయ్యకున్నా దాని వెనుక ఒకే ఒక్క మిషన్


-మిగతా 2 లో



## దేశంలోనే అత్యంత ఖరీదైన నంబర్ ప్లేట్

నంబర్ ప్లేట్ కోసం రూ.1.17 కోట్లు!

2లో



# ఎయిరో స్పేస్..డిఫెన్స్ హబ్‌గా హైదరాబాద్

మొదటి తరువాయి

హబ్‌గా మారిందని చెప్పారు. బెంగుళూరు-హైదరాబాద్ నగరాలను డిఫెన్స్, ఎయిరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఎయిరోస్పేస్ రంగంలో, ముఖ్యంగా వాటి నిర్వహణ, మరమ్మతులు, ఓవర్‌హాల్ వంటి సదుపాయాలతోపాటు పరికరాల తయారీ, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో సాఫ్రన్, బోయింగ్, ఎయిర్ బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవడం ఎంతో సంతోషదాయకమని తెలిపారు. తెలంగాణపై ఎంతో నమ్మకంతో సాఫ్రన్ గ్రూపు తన ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకున్నందుకు ఆ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసులను అందించడంలో దేశంలోనే ఇది మొట్టమొదటి సెంటరని సీఎం వివరించారు. ఈ ఫెసిలిటీ సెంటర్‌తోపాటు సాఫ్రన్‌కు చెందిన ఎం-88 మిలటరీ ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతులు, ఓవర్ హాల్‌కు శంకు స్థాపన చేయటం హర్షనీయమని అన్నారు. భారత వైమానిక దళం, నావికా దళానికి ఇది ఎంతో ఉపయోగపడుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సాఫ్రన్ దాదాపు రూ.1,300 కోట్ల ప్రారంభ పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ ద్వారా వెయ్యి మందికిపైగా నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణు లు, ఇంజనీర్లకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. పెట్టుబడులను ఆహ్వానించడంతోపాటు పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రగతిశీల విధానాలను అవలంభిస్తోందని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేస్తోన్న ఎస్ఎంఈ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిల్లో ఒకటిగా నిలిచింద ని పేర్కొన్నారు. ఇక్కడి ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎయిరోస్పేస్ పార్కులు, ఎస్ఈజెడ్‌లు ప్రముఖ కంపెనీల నుంచి భారీ పెట్టుబడులను ఆకర్షించాయని తెలిపారు. ఎయిరోస్పేస్ రంగంలో గతేడాది ఎగుమతులు రెట్టింపయ్యాయని గుర్తుచేశారు. గత తొమ్మిది నెలల్లో ఎగుమతులు రూ.30 వేల కోట్లకు పైగా చేరుకుని, మొదటిసారి ఫార్మా ఎగుమతు లను అధిగమించాయని తెలిపారు. ఎయిరోస్పేస్ రంగంలో తెలంగాణ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి అవార్డును పొందిందని చెప్పారు.

రాష్ట్రంలో నెలకొల్పిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా విమానాల నిర్వహణకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే అంశంపై తమ ప్రభుత్వం దృష్టి పెడుతోందని సీఎం చెప్పారు. నైపుణ్యాలను మెరుగుపరచడానికి టాటా టెక్నాలజీస్ సంస్థ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 100 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దామని వివరించారు. ప్రపంచ దేశాల్లోని అగ్రశ్రేణి నగరాలతో పోటీ పడాలన్న సంకల్పంతో హైదరాబాద్ విమానాశ్రయం సమీపంలో 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం స్పష్టమైన ప్రణాళికను ఆవిష్కరించడానికి డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అందరినీ ఆహ్వాని స్తున్నామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. భారత లక్ష్యాలను చేరుకోవడంలో తెలంగాణ భాగస్వామిగా ఉండాలని ఆకాంక్షించారు. అదే క్రమంలో 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని సీఎం వివరించారు. కార్యక్రమం లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సాఫ్రన్ గ్రూప్ చైర్మన్ రాస్ మెకలెన్స్, సీఈఓ, డైరెక్టర్ ఒలివర్ అంద్రీస్, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ సీఈవో స్టీఫేన్ క్యూయెల్, జీఎంఆర్ గ్రూపు సంస్థల చైర్మన్ జీఎం రావుతోపాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేవంత్ రియల్ ఎస్టేట్ కోసమే..జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనం

మొదటి తరువాయి

లక్షల కోట్లను కొల్లగొట్టాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారని, తక్షణమే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయంపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. బుధవారం వరంగల్ జిల్లాలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్క్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏ ఒక్క మున్సిపాలిటీలో తీర్మానం చేయకుండా, ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకోకుండా, అఖిలపక్ష సమావేశం పెట్టకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మున్సిపాలిటీల విలీన నిర్ణయం తీసుకున్నది. శాసనసభ సమావేశం పెట్టి, సభ్యుల అభిప్రాయం తీసుకోకుండా విలీనం చేయటం దుర్మార్గం' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరి ఎజెండా కోసం విలీన నిర్ణయం తీసుకున్నారో చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

అవినీతి అనకొండ రేవంత్ రేవంత్‌రెడ్డి పాలనలో అవినీతి రాజ్యమేలుతున్నదని కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'హైదరాబాద్ భూములు తెలంగాణ ప్రజల సొత్తు. హైదరాబాద్ పారిశ్రామిక వాడలు తెలంగాణ ప్రజల నుంచి తీసుకున్న భూములు. వాటిని ప్రజల అవసరాల కోసం వినియోగించాలి.



హైదరాబాద్‌లో కాలుష్యకారక పరిశ్రమలను తరలించేందుకే కేసీఆర్ గతంలో ఫార్మాసిటీ నిర్ణయం తీసుకున్నారు. కొత్త టెక్నాలజీతో కాలుష్యం రాకుండా ఫార్మా కంపెనీలను తరలించి, ఇక్కడ ఉండే భూముల్లో 50 శాతం ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి అనేది మా ఆలోచన అయితే ఫ్యూచర్‌సిటీని రియల్‌ఎస్టేట్ పేరిట అమ్ముకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనగా మారింది. హైదరాబాద్‌లోని 9,300 ఎకరాలను అమ్మి, తెలంగాణను రాహుల్ గాంధీకి ఏటీఎం, పేటీఎంగా రేవంత్‌రెడ్డి మార్చారు. రేవంత్‌రెడ్డి అవినీతి అనకొండగా అవతారం ఎత్తారు' ' అని కేటీఆర్ విమర్శించారు.

**రాహుల్ రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి**

బీసీలకు 42శాతం అమలు చేశామని గొప్పలు చెప్పుకున్న రాహుల్‌గాంధీ, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42శాతం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి తీరా 17 శాతం కూడా అమలు చేయని రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పార్టీ సింబల్ లేకుండా జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ పరంగా రిజర్వేషన్లు కల్పిస్తామని రేవంత్‌రెడ్డి పేర్కొనడం దారుణమన్నారు. బీహార్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడిన రాహుల్‌గాంధీ.. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశామంటూ పచ్చి అబద్ధాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణలోని బీసీ రిజర్వేషన్లను రేరా (రేవంత్ రాహుల్) మాడల్ అని చెప్పుకొని తిరిగి, ఇప్పుడు తడిగుడ్డతో బీసీల గొంతు కోశారని మండిపడ్డారు. బీసీలకు రేవంత్‌రెడ్డి కనీసం 17శాతం కూడా కల్పించడంలేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల పట్ల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై బీసీ మేధావులు, బుద్ధిజీవులు, ప్రజలు ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

# రేవంత్‌రెడ్డి మిషన్ కమీషన్

మొదటి తరువాయి

ఉంటుందనీ, అదే కమీషన్ అని అన్నారు. ఏ స్కీంను ఎలా పటిష్టంగా అమలు చేయాలి, ప్రజల సంక్షేమం, అభివృద్ధి గురించి మంత్రివర్గం చర్చిస్తుందనీ, కానీ కాంగ్రెస్ నేతృత్వంలోని మంత్రివర్గం స్కాంల గురించి ఆలోచన చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రివర్గం ఓ దండుపాళ్యం బ్యాచ్ అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలన సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటే, కాంగ్రెస్ పాలన బడా స్కాంలకు, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని అన్నారు. వాటాలు, పంపకాల్లో తేడా రావడంతో మంత్రులే బయటకు వచ్చి ఒకరి మీద ఒకరు నిందలు వేసుకుంటున్నారని గుర్తు చేశారు. హెచ్ఐఎల్‌టీపీ విధానం సీఎం ఒక్కరి నిర్ణయ ం కాదనీ, మంత్రివర్గ ఉపసంఘానిది అని మంత్రులు మాట్లాడారని అన్నారు. ఈ స్కాంలలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులందరికీ వాటా ఉందన్నారు.

**సర్కారు డ్రామా**

రామగుండం, పాల్వంచ, మక్తల్‌లో 800 మెగావాట్ల చొప్పున 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని హరీశ్‌రావు చెప్పారు. రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ఎన్టీపీసీ, జెన్‌కోకు అవకాశం కల్పిస్తామనీ, ఏది తక్కువ వ్యయంతో నిర్మిస్తే దానికే అవకాశం ఇస్తామంటున్నారని అన్నారు. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.12.23 కోట్ల ఖర్చు అవుతుందంటూ ఎన్టీపీసీ చెప్పిందన్నారు. అదే విధంగా ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.14 కోట్లు ఖర్చవుతాయంటూ జెన్‌కో పేర్కొందని వివరించారు. ఎన్టీపీసీ, జెన్‌కో డీపీఆర్‌లు ప్రభుత్వం వద్ద ఉన్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డ్రామాలు ఆడుతున్నదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక మెగావాట్ ఉత్పత్తికి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో రూ.8.63 కోట్లు, భద్రాద్రి విద్యుత్ కేంద్రంలో రూ.9.74 కోట్లు, ఎన్టీపీసీలో రూ.12.23 కోట్లు ఖర్చయ్యిందని వివరించారు. కమీషన్లు దండుకోవడానికి జెన్‌కోకు రూ.14 కోట్లకు ఖరారు చేసే అవకాశముందన్నారు. ఒక్కో మెగావాట్‌కు రూ.5,600 కోట్ల చొప్పున 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్లు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు. రామగుండంలో ప్రాజెక్టు వ్యయం రూ.10,880 కోట్ల నుంచి రూ.15 వేల కోట్లకు పెరుగుతుందని అన్నారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రామగుండంలో రూ.నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు ఎన్టీపీసీ 1,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసిందని గుర్తు చేశారు. ఇంకా 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. దాని ఉత్పత్తి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తక్కువ ఖర్చుతో విద్యుత్ సరఫరా చేయొచ్చని అన్నారు. రేవంత్‌రెడ్డి అపరిచితుడు, చంద్రముఖిలా మారిపోతున్నారని చెప్పారు.

# సంక్షోభాలను అధిగమిస్తేనే విజయాలు

మొదటి తరువాయి

అభినందించారు. తడబాటు లేకుండా మాట్లాడిన తీరు అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఏ పనైనా శ్రద్ధగా చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని, తాను కూడా చిన్నప్పట్నుంచి అదే అలవరచుకున్నానని వివరించారు. తనను లెక్చరర్ కావాలని తాను చదివిన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సూచిస్తే రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. క్రమశిక్షణతోనే 30 ఏళ్లకే మంత్రిగా, 45 ఏళ్లకే ముఖ్యమంత్రిగా ఎదిగానని చెప్పారు. భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని, ప్రజలకు లభించిన ఆయుధం రాజ్యాంగమని వ్యాఖ్యానించారు. ఓటు వజ్రాయుధం వంటిదని, దానిని అంతా ఉపయోగించుకోవాలని హితవు పలికారు. ఇప్పుడు మాక్ డ్రిల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ వచ్చే ఎన్నికల నాటికి ఓటుహక్కు వస్తుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మాక్ డ్రిల్లో పాల్గొన్న వారిలో ఎక్కువ మంది మహిళలు ఉండటం సంతోషంగా ఉందని, చట్టసభల్లో కూడా 33 శాతం మంది మహిళలకు రిజర్వేషన్ కల్పించిన దేశం ఒక్క భారతేనని గుర్తుచేశారు.

**సాధారణ వ్యక్తులే గొప్పోళ్లు**

దేశంలో సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లే ఇప్పుడు గొప్ప స్థానాల్లో ఉన్నారని చంద్రబాబు అన్నారు. చాయ్వాలా స్థాయి నుంచి నరేంద్ర మోడీ దేశానికి ప్రధాని అయ్యారని, సాధారణ కుటుంబం నుంచి వచ్చిన అబ్దుల్ కలామ్ రాష్ట్రపతిగా ఎదిగారని, గిరిజన మహిళ ద్రౌపది ముర్ము రాష్ట్రపతి అయ్యారని, తాను కూడా సాధారణ కుటుంబం నుంచే నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యానని గుర్తు చేశారు. అందుకే ఇక్కడున్న వారంతా ఆ స్థాయికి ఎదిగేలా ప్రయత్నించాలన్నారు. రాజ్యాగం కొన్ని హక్కులు, బాధ్యతలను ఇచ్చిందని, అయితే కొంతమంది బాధ్యతలను విస్మరించి కేవలం హక్కుల కోసమే పోరాడతారని పేర్కొన్నారు. ఇది సరికాదని తెలిపారు.

# దేశంలోనే అత్యంత ఖరీదైన నంబర్ ప్లేట్

## నంబర్ ప్లేట్ కోసం రూ.1.17 కోట్లు!

**న్యూఢిల్లీ**

కారు రిజిస్ట్రేషన్ నంబర్ హెచ్ఆర్88బీ8888 సరికొత్త రికార్డు సృష్టించింది. బుధవారం జరిగిన వేలంలో దీనికి రూ.1.17 కోట్లు పలికింది. మన దేశంలో అత్యంత ఖరీదైన కార్ నంబర్ ప్లేట్‌గా ఘనతను సొంతం చేసుకుంది. హర్యానా ప్రభుత్వం వీఐపీ లేదా ఫ్యాన్సీ వెహికిల్ రిజిస్ట్రేషన్ ప్లేట్స్‌ను ఆన్‌లైన్‌లో వేలం వేస్తూ ఉంటుంది.అదేవిధంగా శుక్రవారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నిర్వహించిన వేలంలో ఈ నంబర్ ప్లేట్‌కు 45 బిడ్స్ వచ్చాయి. ఈ ప్లేట్‌లోని ఇంగ్లిష్ అక్షరం బీ, అంకె 8 ఒకే విధంగా ఉండటం వల్ల ఎక్కువ మందిని ఆకర్షించింది. బేస్ ప్రైస్ రూ.50,000 నుంచి ప్రారంభమైంది. బుధవారం మధ్యాహ్నానికి రూ.88 లక్షలకు చేరింది. చివరికి వేలం ముగిసే సమయానికి రూ.1.17 కోట్లకు చేరింది.




# ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగం

మొదటి తరువాయి

**రాజ్యాంగంలో సామాజిక న్యాయానికి పెద్దపీట**

ప్రజల స్వాభి మానాన్ని కాపాడే ఎన్నో హక్కులను రాజ్యాంగం దేశ ప్రజలకు ఇచ్చిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రాజ్యాంగం మనకు గొప్ప కర్తవ్య బోధ చేస్తోందని పేర్కొన్నారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో రాజ్యాంగమే మార్గదర్శి అని ఆమె స్పష్టం చేశారు. శాసనాల్లో ఎన్ని మార్పులు చేసినా రాజ్యాంగానికి లోబడి ఉన్నామన్నారు. రాజ్యాంగంలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని, అందులో భాగంగానే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను తీసుకొచ్చినట్టు రాష్ట్రపతి చెప్పారు. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందని, ఆర్థిక ఏకీకరణలో భాగంగా జీఎస్టీ వ్యవస్థను తీసుకొచ్చామని అన్నారు.

**జాతీయతావాదం దిశగా పౌరులను నడిపే గొప్ప గ్రంథం**

వలసవాద మనస్తత్వాన్ని త్యజించి, జాతీయతావాద ఆలోచనా వైఖరి దిశగా పౌరులను నడిపే గొప్ప గ్రంథం రాజ్యాంగం అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మహిళలు, యువత, ఎస్సీలు, ఎస్టీలు, రైతులు, మధ్యతరగతి, కొత్తగా మధ్యతరగతిలో చేరుతున్న వారు భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని రాష్ట్రపతి తెలిపారు. ఇటీవలి కాలంలో 25 కోట్ల మంది భారతీయులను దారిద్ర్య రేఖ నుంచి బయటికి తీసుకురావడం అనేది భారతదేశ గొప్ప విజయమని ఆమె కొనియాడారు.

# ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నాడా?

మొదటి తరువాయి

ఇమ్రాన్ ఖాన్ సోదరీమణులు మంగళ వారం రాత్రి జైలు వద్దకు చేరుకోగా..తమ సోదరుణ్ని కలిసేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. పోలీసులు అందుకు అనుమతించలేదని, పైగా వారిపై తీవ్రంగా దాడి కూడా చేసినట్టు తెలు స్తోంది. దీంతో ఇమ్రాన్ పార్టీ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనలు చేస్తున్నట్టు సమాచారం.

# రాజ్యాంగ విధులే ప్రజాస్వామ్యానికి పునాదులు

మొదటి తరువాయి

ఓటుహక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. బాధ్యతలను నిర్వర్తించే వైఖరి నుంచే హక్కుల ప్రవాహం జరుగుతుందని మహాత్మా గాంధీ విశ్వసించారని తెలిపారు. ప్రజలంతా బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తేనే సామాజిక, ఆర్థిక వికాసానికి పునాదులు పడతాయని భారత జాతిపిత చెప్పేవారని గుర్తుచేశారు. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, బీఆర్ అంబేద్కర్ వంటి ఎంతోమంది మహానుభావులు భారత రాజ్యాంగ రచనలో కీలక పాత్ర పోషించారని మోడీ కొనియాడారు.

# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

మొదటి తరువాయి

ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సర్పంచ్ ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్ల వారీగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్స్‌ల తరలింపునకు సంబంధించి రవాణా తదితర అంశాలపై వారికి పలు సూచనలు చేశారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ ఇచ్చిన అనంతరం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల వారీగా కేటాయించాలని సూచించారు. నేటి నుంచి ప్రారంభం కానున్న మొదటి విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా.. నోటీసు జారీ, రిటర్నింగ్ అధికారిచే వార్డు, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా ప్రదర్శనలో వివాదాలకు తావు లేకుండా చూసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో ఉపేక్షించరాదనీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలని పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా ఏజెన్సీ, ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికలు, సజావుగా, స్వేచ్ఛగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో శాంతి భద్రతల డీజీ మహేశ్ భగవత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ**

సర్పంచ్ ఎన్నికల మొదటి విడతకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఉదయం గ్రామ పోలింగ్ అధికారి ఎన్నికల నోటీసు జారీ చేసిన తర్వాత వార్డు, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. అనంతరం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు తొలి దశలో ఎన్నికలు జరగనున్నాయి.

**ఎన్నికల ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ మాడ్యూల్ ఏర్పాటు**

గ్రామ పంచాయతీ ఎన్నికల ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ మాడ్యూల్ అప్లికేషన్ ఏర్పాటు చేసినట్టు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. పౌర సమాజం తమ యొక్క ఫిర్యాదులను ఈ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసి, వాటి పరిష్కార ప్రగతిని ట్రాక్ చేసుకునే వీలుంటుందని పేర్కొన్నారు. ఈ అప్లికేషన్‌లో తమ మొబైల్ నెంబర్ ద్వారా రిజిస్టర్ చేసుకుని తర్వాత ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. పౌరుల్లో భాద్యతా భావాన్ని పెంచి, ప్రజాస్వామ్యాన్ని పెంచడంలో ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.

# కీలక బిల్లులపై చర్చించేనా?

మొదటి తరువాయి

ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లుల్లో అత్యంత కీలకమైనది అణు విద్యుత్ రంగానికి సంబంధించింది. ఇది రాజకీయంగా సున్నితమైన ప్రతిపాదన. అణు విద్యుత్ రంగాన్ని ప్రయువేటు శక్తులకు కట్టబెట్టడం దీని ఉద్దేశం. పది సంవత్సరాల క్రితం ఇది ఊహకు సైతం రాని ప్రతిపాదన. దేశంలోని అత్యంత శక్తివంతమైన ఆరు కార్పొరేట్ గ్రూపులు అదానీ, అంబానీ, టాటాలు, వేదాంత, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, నవీన్ జిందాల్‌కు చెందిన జిందాల్ ఎనర్జీ ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగల్ వచ్చిన మరుక్షణమే అణు రంగంలోకి ప్రవేశించాలని తహతహలాడుతున్నాయి. అయితే వారి భాగస్వామ్యం చిన్న చిన్న మాడ్యులర్ అణు రియాక్టర్లకు ఆర్థిక సాయం అందించడం, వాటిని నిర్మించడం వరకే పరిమితం. సంప్రదాయ అణు విద్యుత్ ప్లాంట్లను నిర్మించాలంటే అనేక బిలియన్ డాలర్లు ఖర్చవుతాయి. అంతేకాక వాటి నిర్మాణానికి దశాబ్దం లేదా అంతకంటే ఎక్కువ కాలమే పడుతుంది. అణు విద్యుత్ రంగాన్ని ప్రయువేటు సంస్థలకు అప్పగించడంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు సంస్థలు ఎప్పుడూ దీర్ఘకాలిక భద్రత, విశ్వసనీయతపై కంటే లాభాల పైనే దృష్టి పెడతాయని వారు గుర్తు చేశారు.

# జాతీయ బాల చెలిమి కథల పోటీ ఫలితాలు-2025

**హైదరాబాద్, నవంబర్ 26 (అక్షర వేదం) :** చిల్డ్రన్? ఎడ్యుకేషనల్? అకాడమీ, బాల చెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ మార్గదర్శకత్వంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయి కథల పోటీని నిర్వహించినట్లు కన్వీనర్ గరిపెల్లి అశోక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ బాలల్లో విజ్ఞానం, వినోదం, వికాసం పెంపొందించాలనే లక్ష్యంతో గత కొన్నేళ్లుగా బాల చెలిమి ముచ్చట్లు, కథల సంకలనాలు, పర్యావరణ కథల పోటీలను నిర్వహిస్తూ వస్తోందని తెలిపారు. ఈ స్ఫూర్తితో ఆకర్షణీయంగా రూపొందించిన బాలచెలిమి మాసపత్రికను ప్రచురిస్తోందని అన్నారు. తాజా కథల పోటీలకు రెండు రాష్ట్రాల నుంచీ విశేష స్పందన లభించిందన్నారు. పెద్దలు 214 కథలు, పిల్లలు 714 కథలు, యువతరం 48 కథలు పంపారు. నిపుణుల బృందం ఉత్తమ కథలను ఎంపిక చేసింది. విజేతలకు సమాన నగదు బహుమతులు త్వరలో అందజేయబడతాయని తెలిపారు. ఎంపికైన కథలను పలు సంకలనాలుగా ప్రచురించడమే కాకుండా, ప్రచురణకు అనువైన కథలు బాల చెలిమి పిల్లల పత్రికలో కూడా ప్రచురించబడతాయని చెప్పారు. ఈ సందర్భంగా పోటీలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు, విజేతలకు అభినందనలు తెలిపారు.

**పెద్దలు రాసిన పిల్లల కథలు...**
గడువు(ఆకెళ్ల వేంకట సుబ్బలక్ష్మి-హైదరాబాద్?), అదృశ్య దేవత(ఓట్ర ప్రకాష్? రావు-తిరుత్తణి), చందమామపై షికారు(కె.వి.సుమలత-గుడివాడ), ఆరోగ్యమే మహాయోగం(చెన్నూరి సుదర్శన్?-హైదరాబాద్?), ప్రయాణం నేర్పిన పాఠం(జొన్నలగడ్డ శ్యామల-హైదరాబాద్?), ప్రార్థించే పెదవుల కన్నా(నంద త్రినాథరావు-పాట్నా), స్నేహ మధురిమ (పి.ఎల్?.ఎన్?.మంగారత్నం-కాకినాడ), వనదేవత(పుప్పాల కృష్ణమూర్తి- కోదాడ), గూడు మార్చిన కాకి(పోరెడ్డి అశోక్?-ఆదిలాబాద్?), పుష్పవిలాసం(భమిడిపాటి విజయలక్ష్మి-నెల్లూరు), రాజు చేసిన మేలు(బి.వి.పట్నాయక్?-పార్వతీపురం), చిగురించిన విలువలు(మద్దిరాల శ్రీనివాసులు-ఒంగోలు) వెన్నెల(వి.శాంతి ప్రబోధ-హైదరాబాద్?), చిన్న విత్తనం-మహావృక్షం(వెంగళ నరేష్?, అనంతసాగర్), ఫలించిన సాయం(సంగనభట్ల చినరామకిష్టయ్య-ధర్మపురి)

**యువతరం రాసిన పిల్లల కథలు...**
చెట్టు ఉపకారం(కట్టోజు నీరజ-సిద్దిపేట), బతుకమ్మ (కె.పావని-హైదరాబాద్?), వ్యవసాయం (గీస శ్రీజ-అదిలాబాద్), అమ్మో కోతులు(చిలుకూరి హరినందన-హైదరాబాద్?), గురుదక్షిణ(పుల్లా మురళీ ఆకాష్?-కర్నూలు)

**బడిపిల్లలు రాసిన కథలు...**
చేయూత (ఈ.రేణుక-డోను), ప్లాస్టిక్? వాడిన రవి(వి.రోహిత్?-మంగళగిరి), మూఢ నమ్మకాలు(గంగారపు శృతి-నర్సింలపల్లె), బట్ట సంచి(గుగ్లోత్? పూజ-హవేలిఘనపూర్), నిర్లక్ష్యం(జీరు హరిక-గరివిడి), హెల్మెట్?(డి.స్నీతిక-రాంపూర్), అల్లరి కోతి(ధీరెన్? వంగా-హైదరాబాద్?), పట్టుదల(తనూజ బైరాగి-పట్టేడ తిరుపతి), మట్టి గణపతి(తల్లెల కీర్తి-లక్ష్మీపూర్), మతం(పి.ఆశీష్?- మొయినాబాద్?), ప్లాస్టిక్? భూతాన్ని తరిమేద్దాం(భూక్యా వర్షిత-పాలకొల్లు), ఊరు చేసిన తప్పు(బొక్కల విశ్వతేజ-అనంతసాగర్), మూఢనమ్మకాల ముప్పు(ఎం.మహాలక్ష్మి-మేళ్లచెర్వు), రంగుల కలలు(ఎస్?.శ్రీవర్ధన్?, నల్లగొండ), పుస్తకం కోసం పోరాటం(సి.హెచ్?.అభిషేక్?, స్టేషన్? ఘనపూర్), సహకారం(సి.హెచ్?.బ్రాహ్మణి-నెల్లూరు) లను ఎంపిక చేసినట్లు తెలిపారు.

# భారత రాజ్యాంగ ప్రాముఖ్యత ను అందరు తెలుసుకోవాలి ఆర్.జి-3, జి.యం.




**అక్షర వేదం:నవంబర్ 26,రామగిరి** భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను అందరు తెలుసుకోవాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు.
బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని జి.యం. కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ముందుగా ఉద్యోగులందరూ రాజ్యాంగ ప్రవేశికను చదివారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ,న్యాయం,సమానత్వం, సౌభ్రాతృత్వం అందిస్తూ రూపొందించబడిన మన భారత రాజ్యాంగం 1949,నవంబర్26 న ఆమోదించబడిన సందర్భంగా 2015 నుండి ప్రతి సంవత్సరం భారత రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు.1950,జనవరి 26 నుండి రాజ్యాంగాన్ని అమలులోకి తీసుకువచ్చారన్నారు. ప్రజలే పాలకులుగా రూపు దిద్దుకున్న మన భారత దేశానికి ఒక దశ,దిశ కల్పించడం కోసం రాజ్యాంగ రూపకల్పన చేశారన్నారు. భారత రాజ్యాంగ ప్రతిని రూపొందించిన కమిటీకి అధ్యక్షుడిగా వ్యవహరించి, రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ను మనం మరిచిపోలేమన్నారు. వారు దేశంలోని భిన్న నాగరికతలు, భిన్న మతాలు, కులాలు,ప్రాంతాలకు ప్రాధాన్యమిస్తూ రాజ్యాంగ రూపకల్పన చేశారన్నారు.ప్రతీ ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని గ్రహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు సంతోష్,రవి కుమార్, అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు బి.టి.మురళికృష్ణ, ఏరియా ఇంజినీర్లు వై.వి.శేఖరబాబు, కె.యాదయ్య,ఎస్వోటూజియం బండి సత్య నారాయణ, విభాగాధిపతులు జనార్దన్ రెడ్డి, కె.ఐలయ్య,సునీల్ ప్రసాద్,ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# క్రీడలు విద్యార్థుల యొక్క మానసిక శారీరక వికాసానికి దోహదం చేస్తాయి

**- ప్రతాపగిరి శ్రీనివాసు,**
**ప్రధానోపాధ్యాయులు,పత్రికా కాలమిస్ట్**






**(అక్షర వేదం ప్రతినిధి కమలాపూర్)**
పి ఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ నందు 26. 11. 2025 మరియు 27.11. 2025 తేదీలలో రెండు రోజులు పాఠశాల స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా అండర్ 14 అండర్ 19 విభాగాలలో వేరువేరుగా కబడ్డీ,ఖో ఖో, వాలీబాల్ మరియు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు పంపించడం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. అనిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రతాపగిరి శ్రీనివాస్ పంగిడిపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పత్రికా కాలమిస్ట్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడలు మానవ జీవితంలో ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయని ముఖ్యంగా శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తూ ఒత్తిడిని తట్టుకునే లక్షణాలను పెంపొందిస్తూ, వ్యక్తి తన జీవితంలో క్రమశిక్షణతో, ఏకాగ్రతతో ఉంటూ క్రీడల నైపుణ్యంతో తను ఆర్థికంగా ఎదగడానికి, ఉద్యోగాలు సంపాదించుకోవడానికి ఉపయోగ పడుతూ తన యొక్క సర్వాంగీన వికాసానికి తోడ్పడతాయన్నారు. అందువల్ల విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడలల్లో పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమానికి కమలాపూర్ సిఐ హరి కృష్ణ గారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు అనేక దురలవాట్లకు గురై క్రమశిక్షణా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని అలాంటివి అలవర్చుకోకుండా ఉండాలని అప్పుడే వారి జీవితాలు సవ్యంగా సాగుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో అతిథిగా హాజరైన కురిమిల్ల సారయ్య గారు మాట్లాడుతూ లలిత కళల్లో ఒకటైన క్రీడలల్లో ఏదేని క్రీడను అలవర్చు కోవాలన్నారు. సమావేశ అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించి టెంకాయ కొట్టి క్రీడలను హాజరైన ముఖ్య అతిథులు లాంచనంగా ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంథని ఆర్టీసీ డిపో ఉద్యోగుల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుక

**అక్షర వేదం/మంథని,నవంబర్26:** మంథని ఆర్టీసీ బస్సు డిపో ఉద్యోగులు 76వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను బుధవారం రోజున ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మంథని బస్సు డిపో ఆవరణలో ఉద్యోగులు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలవేసి భారత రాజ్యాంగ నిర్మాణ ఆమోద దినోత్సవం జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరిండెంట్ సుజాత,మెకానికల్ సూపరిండెంట్ ఇక్బాల్,సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ సాగర్ రెడ్డి,ఎడిసి ఐలయ్య,ఎస్సీ,ఎస్టీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు శనిగరపు సదయ్య,అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు..



## అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆదివాసి జాగృతి జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్




**అక్షర వేదం కరీంనగర్**
జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ ఆదేశాల మేరకు జాగృతి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం ఆమోదించిన రోజును పురస్కరించుకొని కరీంనగర్ కోర్టు చౌరస్తా లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి భారత రాజ్యాంగ దినోత్సవ సంబరాలు జరుపుకొన్నారు.ఈ సందర్భంగా ప్రతి పౌరునికి స్వేచ్ఛను, సమానత్వాన్ని, కల్పించింది భారత రాజ్యాంగం అని ,భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం, అంబేద్కర్ ఆలోచన విధానంతో ప్రతి పౌరుడు పయనించాలని, వారి యొక్క ఆశయాలను కొనసాగించాలని సామాజిక తెలంగాణ లో పాలుపంచుకోవాలని ఈ విషయంలో జాగృతి ముందు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు శ్రీరాముల రమేష్, ఆదివాసి జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, ఎస్సీ సెల్ నాయకులు చంటి శ్రీనివాస్ , మహిళా నాయకురాలు జంగా అపర్ణ, పోతన రూప,సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, ఆటో యూనియన్ కొత్తూరి రఘు, ఎండి హుస్సేన్, ఘర్ష గుర్తి విద్యాసాగర్ ,హెచ్ రాజు, ఇతరులు పాల్గొన్నారు

# విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు.







**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజిగిరి / మేడిపల్లి: బోడుప్పల్, నవంబర్ 26** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నవంబర్ 26 న భారతదేశంలో ప్రతి సంవత్సరం రాజ్యాంగ దినోత్సవం (కన్స్టిట్యూషన్). సందర్భంగా రాజ్యాంగ విలువలు పెంపొందించడం, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి, ఆర్. అంబేద్కర్ ' సేవలను స్మరించుకుంటూ, విద్యార్థులలో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వాహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడిపల్లి ఎస్సై పి. శ్రీను హెడ్ కానిస్టేబుల్ - కృష్ణయ్య పాల్గోని, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు . ఈ సందర్భంగా ఎస్సై శ్రీను మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలాకు అలవాటు పడి అరోగ్యంతో పాటు జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అన్నారు. డ్రగ్స్ కు అలవాటు పడిన వారు విచక్షణ కోల్పోయి ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితులలో తప్పులు చేస్తున్నారు. అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏజీఎం వీర రెహమాన్, ప్రధానోపాద్యాయములు, ఎ.రాజేందర్,మరియు అకాడమిక్ డీన్ దీపక్, నరేష్, ప్రైమరీ ఇన్చార్జ్ రేఖా, సాయి మరియు, తదితరులు పాల్గోన్నారు.

# రాజ్యాంగం ద్వారానే భారతదేశ పరిపాలన



**అక్షర వేదం/మహాముత్తారం, నవంబర్26:**
భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే భారతదేశ పరిపాలన అంతా జరుగుతుందని మహాముత్తారం అంబేద్కర్ సంఘం కమిటీ ముఖ్య సలహాదారు గంధం రాజేష్ స్పష్టం చేశారు. 76వ రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఢిల్లీ పార్లమెంటు పాలన దగ్గర నుండి గ్రామపంచాయతీ పాలన వరకు రాజ్యాంగం అనుసరించే పాలన కొనసాగుతుందని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన గొప్ప గ్రంథమని పేర్కొన్నారు. అధికారులైనా, ప్రజా ప్రతినిధులైన, మీడియా సభ్యులు అయిన ప్రతి ఒక్కరూ రాజ్యాంగం అనుసరించి విలువలు పాటించాలని తెలిపారు. ఎంత పెద్ద అధికారైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని చట్టానికి లోబడే పని చేయాలన్నారు. కోట్లాది ప్రజల గౌరవం, హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అనే మూల సూత్రాలకు పునాది భారత రాజ్యాంగం అని అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన బాధ్యత భారతదేశంలో ఉన్న ప్రతి పౌరునికి ఉన్నదని స్పష్టం చేశారు.

## జిల్లా కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన జిల్లా అధ్యక్షుడుటీ.రామాంజనేయులు



**అక్షర వేదం/ జోగులాంబ గద్వాల:**
రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు టి రామాంజనేయులు హాజరై మాట్లాడుతూ.భారత రాజ్యాంగ ఉపోద్ఘాతం చదివి వినిపిస్తూ, రాజ్యాంగం యొక్క మహత్తును, ప్రతి పౌరుడు పాటించాల్సిన కర్తవ్యాలను వివరించారు.మన దేశ ప్రజలకు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందేలా రూపొందించబడిన భారత రాజ్యాంగం, ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. 1949 నవంబర్ 26న ఆమోదించబడిన రాజ్యాంగం ప్రతి భారతీయుడికి గర్వకారణం,అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, శ్యామ్ రావ్,అసెంబ్లీ పోటి చేసిన అభ్యర్థి బలిగేరా శివారెడ్డి,జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్,మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, బిజెపి నాయకులు రఘు గౌడ్,పాండు, అశోక్,వంశీ తదితరులు హాజరయ్యారు..

## నాలుగు లేబర్ కోడ్స్ ను వ్యతిరేకిస్తూ జి.ఎం కు వినతి పత్రం





**అక్షర వేదం: నవంబర్26, రామగిరి**
కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ ను వ్యతిరేకిస్తూ సింగరేణి జేపీసీ నాయకులు టీబీజీకేఎస్ నాగేల్లి సాంబయ్య,ఐఎన్ టియుసి కోట రవీందర్ రెడ్డి,ఏఐటీయూసీ ఎం ఆర్ సి రెడ్డి, సిఐటియు కొమురయ్య నాయకులతోపాటు అన్ని సంఘాల నాయకులు కార్యకర్తలు జిఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేసి ఆర్జీ3 జి.ఎం.నరేంద్ర సుధాకర్ రావు కు వినతి పత్రం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు దేవ శ్రీనివాస్, శ్రీకాంతారావు,కేశవరావు,రవిశంకర్,వివి గౌడ్, పూర్ణాకర్,దేవరకొండ తిరుపతి,చిప్ప సురేష్,దాసరి మల్లేష్,గండి శ్రీనివాస్,కొప్పుల సురేష్,శేఖర్ రెడ్డి, వేణుగోపాల్,రాఘవరెడ్డి,సందీప్ తదితరులతో పాటు ఇతర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## పోలవరం కాలువ గట్టుపై వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి విగ్రహ ఆవిష్కరణ

**పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**
**భారీ అన్న సమారాధన వేలాదిగా భక్తులు హాజరు**




**కాకినాడ జిల్లా,నవంబర్ 26 (అక్షర వేదం) :**
గండేపల్లి మండలం తాళ్లూరు నుండి ఉప్పలపాడు వెళ్లే మార్గంలో పోలవరం కాలవ గట్టు పక్కన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి 18 అడుగుల విగ్రహ ఆవిష్కరణ, శిలా మూర్తి ప్రతిష్ట మహోత్సవం సీతానగరం మండలం చిన్న కొండే పూడి గ్రామకాపరస్తులు యనమదల నాగేశ్వరరావు పద్మ దంపతులచే విగ్రహావిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కోర్పు సాయి తేజ, భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కారనిర్వాక అధ్యక్షులు, సత్య సనాతన గోసంరక్షణ పరిషత్ అధ్యక్షులు, టిడిపి యువ నాయకులు పాలచర్ల నాగేంద్ర చౌదరి హాజరయ్యారు. ముందుగా విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదా స్వీకరించారు. వేలాదిగా భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించి ఆ స్వామివారిఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, పాలచర్ల మంగారావు, కందుల వీరబాబు,అడబాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాదు ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్-2025 బ్రోచర్ ఆవిష్కరణ

**- టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్**

**అక్షర వేదం/ హైదరాబాద్, నవంబర్ 26:**
హైదరాబాద్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ – 2025 బ్రోచర్ ను టీపీసీసీ అధ్యక్షుడు, తెలంగాణ కరాటే డూ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ బుధవారం ఆవిష్కరించారు. డిసెంబర్ 13, 14 తేదీల్లో సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. ఛాంపియన్షిప్ ను సీకోకై కరాటే తెలంగాణ సంస్థ, తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ తో కలిసి ఈ పోటీలను నిర్వహిస్తోంది. కరాటే ఇండియా ఆర్గనైజేషన్ (కేఐఓ) అనుమతితో ఈ



జరుగుతున్నాయని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఇది వరల్డ్ కరాటే ఫెడరేషన్ (డబ్ల్యూకెఎఫ్) కు అనుబంధంగా ఉంది. ఈ సందర్భంగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..“హైదరాబాదు ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ యువ కరాటే విద్యార్థులకు తమ నైపుణ్యాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రదర్శించే అద్భుతమైన వేదికగా నిలుస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా యువతలో కరాటే కళ ను ప్రోత్సహించడం, వారిలో ఆత్మవిశ్వాసం, స్ఫూర్తిని మరింత పెంచడమే లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో సెల్యూట్ మార్షల్ ఆర్ట్స్ ఫౌండర్, ఏ.కె.ఎఫ్.జడ్జ్, డబ్ల్యూ.కె.ఎఫ్. సెన్సై తాడూరి కనక రాజు, తెలంగాణ కరాటేడూ అసోసియేషన్ కోశాధికారి రామ స్వామి, విజయ్, భరత్, జి.కే.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఖనిలో ఘనంగా 76వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్26**
ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో. బుధవారం గోదావరిఖని పట్టణంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ముందు గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా 76వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్ రాజేష్ , అధ్యక్షతన,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, సింగరేణి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర కమిటీ ముఖ్య సలహాదారులు పులిమోహన్ ఆధ్వర్యంలో జరిగిన 76 వ రాజ్యాంగ అమలు దినోత్సవ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, సిపిఐ జిల్లా కార్యదర్శి, తాంద్ర సదానందం,రామగుండం నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి, కందుల సంధ్యారాణి, సీనియర్ హైకోర్టు అడ్వకేట్ గొర్రె రమేష్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, సింగరేణి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు పులిమోహన్,. రిటైర్డ్ ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ బి రాజయ్య, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపెల్లి సతీష్, బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఇరుకుల్ల రాజనర్సయ్య బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశానికి రాజ్యాంగాన్ని అందించి దిశా నిర్దేశం చేసిన గొప్ప మహోన్నతుడు త్యాగశీలి బాబాసాహెబ్ అంబేద్కర్ అని అన్నారు, ప్రపంచ మేధావిగా దళిత బహుజన అనగారిన వర్గాలకు దిక్సూచిగా ఉన్న బాబాసాహెబ్ అంబేద్కర్, నేడు ప్రపంచానికే మార్గదర్శకుడయ్యారన్నారు అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే సకలజనులు న్యాయం జరుగుతుందన్నారు, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసినర్ ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు సాధ్యమైందన్నారు ప్రపంచ దేశాల మార్గదర్శకుడు బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ను మనమంతా ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాల కోసం పనిచేయల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు, ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇరుగురాలకిష్టయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఆకునూరి బాల అంకుష్, గద్దల శశి భూషణ్, సింగరేణి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, బొచ్చు శంకర్ శనిగరపు పోచయ్య, మహంకాళి శంకర్ దయాల్ శర్మ, ఉదయ్ కుమార్, మాల మహానాడు పట్టణ అధ్యక్షులు మాలెం మధు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, రామగుండం నియోజకవర్గ ఇన్చార్జి బొట్ల స్వామి, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కన్వీనర్ బూడిద మహేందర్, కో కన్వీనర్లు పంజా అశోక్, గొర్రె నర్సింగరావు, సీనియర్ నాయకులు యాసర్ల చిరంజీవి, పుల్లూరి మహేందర్ తోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు,

# విద్య, క్రీడలు విద్యార్థులకు ప్రగతి మార్గాలు

**-ప్రముఖ విద్యావేత్తలు శ్యామ్ సుందర్ రెడ్డి, బి.గాలయ్య**
**-ఐఎంఎస్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ట్రోఫిని బహూకరించి, అతిథులను సన్మానించిన డాక్టర్ పి.శ్యామ్ సుందర్ రెడ్డి, బి.గాలయ్య, మిథిలేష్ కుమార్**

**హైదరాబాద్, నవంబర్ 26 (అక్షర వేదం) :**
విద్య, కుటుంబ నైతిక విలువలు, జాతీయ భావాలు, సమైఖ్యతతో పాటు క్రీడలు బాల్యంలో పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాదులుగా నిలుస్తాయని అనిబిసెంట్ జూనియర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల కరస్పాండెంట్ సెక్రెటరీ, ప్రముఖ హోమియోపతి వైద్య నిపుణులు డాక్టర్ పి.శ్యామ్ సుందర్ రెడ్డి పేర్కొన్నారు. వందేమాతరం గేయం రచించి 150 వసంతాలను పురస్కరించుకొని జియాగూడలోని ఇంద్రాణి మహావిద్యాలయ హైస్కూల్ ఆధ్వర్యంలో బల్దియా కాలనీ మున్సిపల్ క్రీడామైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఐఎంఎస్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్–02 క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ క్రికెట్ టోర్నమెంట్లో ఉత్సాహంగా, పోటాపోటీగా పాల్గొన్నారు. మొత్తం 8 బృందాలు టోర్నమెంట్లో హెూరాహెూరీగా పాల్గొనగా సోల్జర్ హౌజ్(ఎ) వీర హౌస్ బృందాలు ఫైనల్స్ కు చేరుకుని క్రికెట్ క్రీడలో నువ్వానేనా అనే తరహాలో తలపడ్డాయి. చివరికి సోల్జర్ హౌజ్–ఎ బృందం







విజేతగా నిలువగా, వీర హౌజ్ బృందం రన్నరప్ గా నిలిచింది. ఈ మేరకు బుధవారం జరిగిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్(ట్రెస్మా) ఆసిఫ్ నగర్ మండల గౌరవ అధ్యక్షుడు బి.గాలయ్యతో పాటు డాక్టర్ పి.శ్యామ్ సుందర్ రెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ అండ్ కరస్పాండెంట్ ఎమ్.మిథిలేష్ కుమార్, క్రీడల విభాగం కన్వీనర్ ప్రియాంశు శ్రీవాస్తవ్, హెచ్.ఓ.డి.లు ఇంద్రాణి, అశోక్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ దివ్యజ్యోతి, కో–ఆర్డినేటర్ సింధూజ, కో ఆర్డినేటర్ శ్వేత, తదితరులు ముఖ్య అథులుగా హాజరయ్యారు. క్రికెట్ పోటీలో విజేత కెవెన్ హర్డాన్ బృందం శ్యామ్ సుందర్, యాక్టివిటీ ఇంఛార్జి మీనాక్షి, క్రికెట్ పోటీల్లో విజేత బృందం కెప్టెన్ హర్ష్ బిడ్లాన్ బృందానికి శ్యామ్ సుందర్ రెడ్డి, గాలయ్యల చేతుల మీదుగా ట్రోఫీని బహూకరించారు. ఇతర క్రీడాకారులతో పాటు రన్నరప్ కెప్టెన్ కె. విరాట్, ఇతర క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బి.గాలయ్య మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబర్చడం ద్వారా విద్యార్థులకు శారీరక మానసిక వికాసంతో పాటు వివిధ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు, రాయితీలు లభిస్తాయని వివరించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ ప్రిన్సిపల్ మిథిలేష్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు కూడా ఒక అదనపు అర్హత అనే వాస్తవాన్ని తెలియజేసేందుకే యేటా క్రీడోత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. తమ స్కూల్ కు చెందిన ఎందరో విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్, రెజ్లింగ్, కబడ్డీ, క్రికెట్ తదితర క్రీడల్లో రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, అలాంటి ప్రతిభగల విద్యార్థులకు తమవంతు ప్రోత్సాహకాలు ఎప్పటికీ ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలి



**-సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక జీ ఎం ఆఫీస్ ముందు ధర్నా**

**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్26**
దేశ కార్మికులను కట్టు బానిసలుగా మార్చుకునే విధంగా ఈ దేశంలో ఉన్నటువంటి బడా కార్పొరేట్ వ్యవస్థలకు పూర్తి అనుమతులు ఇచ్చే విధంగా ఉన్న 4 కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆర్ జీ వన్ జీ ఎం ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి ఎస్ ఓ టు జీఎం కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ ఎం ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ, ఎస్ జి బి కే ఎస్ (ఏ ఐ ఎఫ్ టి యు) రాష్ట్ర అధ్యక్షులు జీ రాములు, టి ఎన్ టి యు సి రాష్ట్ర నాయకులు దామోదర్ రెడ్డి, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షులు కే విశ్వనాథ్ లు మాట్లాడుతూ... భారతదేశ కార్మికవర్గానికి మేలు చేయలేని 4 లేబర్ కోడ్ లను తీసుకొచ్చి మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుగా ఈ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యవహార శైలి ఉందని ఎద్దేవా చేశారు. బడా కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే ఈ లేబర్ కోడ్ లు ఉన్నాయని, మతోన్మాద బిజెపి ప్రభుత్వం, దేశ కార్మిక వర్గంపై కనీసం సవితి తల్లి ప్రేమను కూడా చూపటం లేదని అన్నారు. అనేక సంవత్సరాల పోరాట ఫలితంగా సాధించుకున్నటువంటి హక్కులను కాలరాస్తున్నారని, ఒకవైపు 8 గంటల పనిదినం కావాలని కార్మిక సంఘాలు పోరాడుతుంటే మరో వైపు 12 గంటల వరకు కార్మికులతో పని చేపించుకునే విధంగా యాజమాన్యానికి పూర్తి హక్కులు కల్పిస్తున్నట్టుగా 4 లేబర్ కోడ్ లను తీసుకోని రావటం అంటే కార్మిక వర్గాన్ని రెచ్చగొట్టే విధంగా ఉందని అన్నారు. ఇకనైనా కార్మిక ప్రయోజనాల కోసం పాలకులు ఆలోచించాలని, 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలనీ లేని పక్షంలో కార్మిక వర్గాన్ని సమీకరించి మిలిటెంట్ పోరాటాలకు కూడా సిద్ధం అవుతామని కేంద్ర ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు సారయ్య, దావూ రమేష్, ఈ నరేష్, రత్న కుమార్, కొండి శ్రీనివాస్, గుండేటి మల్లేశం, ఎం కొమరయ్య ఎస్ ప్రసాద్, రామచందర్, రాయపోచం, సంతోష్ , మల్లేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐ.ఎస్ సదన్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు




**ఐ.ఎస్.సదన్,నవంబర్ 26 (అక్షర వేదం) :**
సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మొహమ్మద్ ఆసిఫ్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు సెల్ ఫోన్ డ్రైవింగ్ మద్యం సేవించి వాహనం నడపడం అలాగే ఇతర ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరిస్తామని పోలీస్‌లు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే, ముఖ్యంగా మద్యం సేవించి డ్రైవ్ చేస్తే నేరస్తులను నేరుగా గౌరవ న్యాయస్థానం ముందు హాజరు పరుస్తామని పోలీసులు హెచ్చరించారు.

# ప్రజావాణి రద్దు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల,నవంబర్ 26 (అక్షర వేదం)**
2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు-2025 దృష్ట్యా ప్రతి సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి నిర్వహించు వివరాలను పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడం జరుగుతుందని, ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

# జిఎం ఆఫీస్ ల ముందు కార్మిక సంఘాల ధర్నా...

**నాలుగు లేబర్ కోడ్ ల గెజిట్ ఉపసంహరించుకునేంతవరకు ఉద్యమం ఆపేది లేదు..**

**అక్షర వేదం గోదావరిఖని నవంబర్ 26**
కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల పై, నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన కార్మిక సంఘాలు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన ధర్నా లో ఏఐటియుసి, ఐఎన్టీయుసి, సిఐటియు, టిబిజికెఎస్ సంఘాల నాయకులు కొరిమి రాజ్ కుమార్, ఎ.శ్రీనివాస్, టి.రాజిరెడ్డి, మాదాసు రాంమూర్తి, వడ్డెపల్లి శంకర్ లు కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రసంగించారు. ముఖ్యంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, కొత్తగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు




లేకుంటే సింగరేణి వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాల ను కలుపుకొని మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ధర్నా అనంతరం అర్జీ వన్ జనరల్ మేనేజర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, సహాయ కార్యదర్శి రంగు శ్రీను, ఐఎన్టీయుసి నాయకులు సదానందం, సిఐటియు నాయకులు మెండె శ్రీనివాస్, ఆరెపెల్లి రాజమొగిలి , టిబిజికెఎస్ నాయకులు చెలకలపల్లి శ్రీనివాస్, చల్లా రవిందర్ రెడ్డి లతో పాటు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం



**రామంతపూర్, నవంబర్ 26 (అక్షర వేదం) :**
క్రీడల తో మానసిక ఉల్లాసం శారీరక దృఢత్వం కలుగుతుందని ఆధునిక పోకడలకు తగ్గట్టుగా ఇలాంటి బాక్స్ క్రికెట్ ప్లే జోన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా రామంతపూర్ డివిజన్ శ్రీరామ కాలనీలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ ప్లే జోన్ ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాక్స్ క్రికెట్ యజమానులైన గుర్రం వీరేశం బొడ్డుపల్లి శ్రీనివాస్ కు ప్రభాకర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుల బంధుమిత్రులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## భారత ప్రజాస్వామ్యానికి పునాది

# రాజ్యాంగ దినోత్సవం







**- బాలానగర్ సీఐ నర్సింహా రాజు**

**కూకట్ పల్లి నవంబర్ 26, (అక్షర వేదం) :**
భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాది వేసిందని, ప్రతి సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా ఘనంగా జరుపుకుంటారని సీఐ నర్సింహా రాజు అన్నారు. బాలానగర్ లోని జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎమ్ అరుణజ్యోతి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసినా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముందుగా రాజ్యాంగ రూపకర్త డా. బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ సరిగ్గా ఇదే రోజున 1949, నవంబర్ 26వ తేదీన, భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిందని తెలిపారు. ఈ చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేసుకుంటూ ఈ రోజును రాజ్యాంగ దినోత్సవంగా పాటిస్తున్నామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం భారత రాజ్యాంగమని గర్వంగా తెలిపారు, దీని రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన డా. బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షత వహించిన ముసాయిదా కమిటీ, ప్రపంచంలోనే అతి పొడవైన లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించిందని.. ఇందులో 395 ఆర్టికల్స్, 22 భాగాలు, మరియు 12 షెడ్యూల్స్ ఉన్నాయన్నారు. రాజ్యాంగ ప్రాముఖ్యతను పునరుద్ఘాటించడంతోపాటు, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ మౌలిక సిద్ధాంతాలను నొక్కిచెప్పారు.

**సైబర్ నేరాలు, డ్రగ్స్ పై అవగాహన:**
ఇటీవల సైబర్‌నేరాలు అధిక మయ్యాయని, ప్రస్తుతం మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికను ఆసరాగా చేసుకుని అక్రమార్కులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని వాటిని అరికట్టేందుకు ప్రజలు సైబర్ నేరగాళ్ల చెప్పిన మాటలు నమ్మవద్దని, వెంటనే పోలీసులను సంప్రదించి సహకరించాలన్నారు. విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యువత ఇంటర్నెట్ పరిమితికి మించి వాడకూడదని, సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులను కాజేస్తున్నారని అన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అరుణజ్యోతి తోపాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నలంద విద్యా మందిర్‌లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



**దేవరకొండ, నవంబర్ 26 (అక్షర వేదం) :**
నలంద విద్యా మందిర్, పడమటిపల్లి పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దేశ అత్యున్నత చట్టం పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంచడం, దాని విలువలను తెలియజేయడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అంకూరి శివకుమార్ మాట్లాడుతూ... రాజ్యాంగ రచనలో డా. బి.ఆర్. అంబేద్కర్ చేసినటువంటి విశేష కృషిని, ఆయన సేవలను విద్యార్థులకు వివరించారు. దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో, పౌరుల హక్కులను కాపాడడంలో భారత రాజ్యాంగం యొక్క గొప్పతనాన్ని, దాని విలువలను సవివరంగా తెలియజేశారు. రాజ్యాంగంలోని ప్రాథమిక అంశాలు, పౌరుల కర్తవ్యాలపై ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో

# తపస్ మండల అధ్యక్ష-ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

**హయత్‌నగర్,నవంబర్ 26, (అక్షర వేదం):**
రంగారెడ్డి జిల్లా తపస్ హయత్‌నగర్ మండల అధ్యక్షుడిగా చీర నర్సింహా, ప్రధాన కార్యదర్శిగా వడ్ల సురేష్ కుమార్, అబ్దుల్లాపూర్మెట్ మండల అధ్యక్షుడిగా గంట గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీహరి గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కోట్ల కాశీ రావు, ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్, రాష్ట్ర బాధ్యులు మెరువ శ్రీహరి కృష్ణ, జిల్లా బాధ్యులు బి. శంకర్, కె. శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.







# యోధుడిగా బాలయ్య..

## ఎన్‌బీకే 111 షూటింగ్ షురూ!

ఒకవైపు అఖండ 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నందమూరి నటసింహం బాలయ్య మరోవైపు తన కొత్త సినిమాను పట్టాలెక్కించబోతున్నాడు. తనకు 'వీర సింహా రెడ్డి' వంటి సంచలన విజయం ఇచ్చిన దర్శకుడు గోపిచంద్ మలినేనితో బాలయ్య తన కొత్త చిత్రం చేయబోతున్నాడు. ఎన్‌బీకే 111 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్ నేడు పూజా కార్యక్రమాలతో అధికారింగా ప్రారంభమైంది. బుధవారం సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినం సందర్భంగా హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు బాలకృష్ణతో పాటు దర్శకుడు బోయపాటి శ్రీను, నిర్మాత కేఎస్ రామారావు, దర్శకుడు బుచ్చిబాబు, దర్శకుడు బాబి కొల్లి తదితరులు హాజరయ్యారు.ఈ సినిమా ఒక చారిత్రక యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇందులో బాలకృష్ణ మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన యోధుడు పాత్రలో కనిపించబోతున్నారని సమాచారం. గోపీచంద్ మలినేని బాలయ్య పాత్ర కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, హిస్టారికల్ యాక్షన్ సీక్వెన్స్‌లను అంతర్జాతీయ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో బాలకృష్ణ సరసన స్టార్ హీరోయిన్ నయనతార నటిస్తున్నారు. 'సింహా', 'శ్రీ రామరాజ్యం' తర్వాత వీరిద్దరి కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటం విశేషం. నయన్ ఇందులో రాణి పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఎస్.ఎస్. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం బాలయ్య 'అఖండ 2' ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నప్పటికీ.. డిసెంబర్ మూడో వారం నుంచి NBK 111 రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ సినిమాతో మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని తొలిసారిగా చారిత్రక నేపథ్యాన్ని ఎంచుకోవడం ప్రాజెక్టుపై ఆసక్తిని మరింత పెంచింది.

# మహేష్ బాబు సినిమా వల్లే టాలీవుడ్‌కి దూరం!

టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 'కెరటం' సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన రకుల్, వరుస విజయాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. రామ్ చరణ్, ఎన్టీఆర్, అల్లు అర్జున్, రవితేజ, మహేష్ బాబు వంటి స్టార్ హీరోల సరసన నటించి మంచి క్రేజ్ సంపాదించింది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'లక్ష్యం', 'సరైనోడు', 'నాన్నకు ప్రేమతో', 'ధ్రువ' వంటి సూపర్ హిట్స్‌తో టాలీవుడ్‌లో టాప్ రేంజ్‌లో నిలిచింది. అయితే ఈ మధ్య రకుల్‌కి టాలీవుడ్‌లో అవకాశాలు కరువయ్యాయి.ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రకుల్, తన కెరీర్‌ను మలుపు తిప్పిన ఘటనను బహిరంగంగా వెల్లడించింది. మహేష్ బాబు ఏఆర్ మురుగదాస్ కాంబినేషన్‌లో వచ్చిన హై బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పైడర్' లో రకుల్ హీరోయిన్‌గా నటించిన విషయం తెలిసిందే. అయితే భారీ అంచనాలతో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆకట్టుకోలేకపోయింది.దీని గురించి మాట్లాడిన రకుల్ టాలీవుడ్‌లో నాకు వరుసగా ఎనిమిది, తొమ్మిది హిట్స్ వచ్చాయి. 'స్పైడర్' నా కెరీర్‌లో వచ్చిన తొలి పెద్ద డిజాస్టర్. ఆ ఒత్తిడిని మానసికంగా తట్టుకోలేకపోయాను. నాపై వచ్చిన విమర్శలు, నెగెటివ్ ఎనర్జీ నాకు బాగా తగిలాయి. అందుకే టాలీవుడ్ నుంచి దూరంగా వెళ్లాలని నిర్ణయించుకున్నాను." అని చెప్పుకొచ్చింది.'స్పైడర్' ఫెయిల్యూర్ తర్వాత తనకు వచ్చిన అనేక అవకాశాలను కూడా తానే తిరస్కరించినట్లు రకుల్ వెల్లడించింది. తెలుగులో తగ్గిన అవకాశాల తర్వాత ఆమె బాలీవుడ్‌పై దృష్టి పెట్టింది. అయ్యారీ, దేవ, డే డే ప్యార్ డే, థ్యాంక్ గాడ్, ఛత్రీవాలీ వంటి సినిమాలతో ముంబై ఫిల్మ్ ఇండస్ట్రీలో బిజీగా మారింది. పలు పాన్ ఇండియా బ్రాండ్లకు అంబాసడర్‌గా, డిజిటల్ ప్రాజెక్టుల్లోనూ ఆమె ఆదరణ పొందుతోంది. రకుల్ ప్రీత్ చేసిన వ్యాఖ్యలు బయటకు రావడంతో సోషల్ మీడియాలో చర్చలు జోరుగా సాగుతున్నాయి. 'స్పైడర్' ప్రభావం ఎంత తీవ్రంగా రకుల్‌ను దెబ్బతీసిందో నెటిజన్లు వివిధ కోణాల్లో చర్చిస్తున్నారు.






## పిశాచి 2లో న్యూడిటీ లేదు.. కానీ చాలా ఎరోటిక్ సీన్లుంటాయి : ఆండ్రియా

కోలీవుడ్ డైరెక్టర్ మిస్కిన్ తెరకెక్కించిన హార్రర్ మూవీ పిశాచి బాక్సాఫీస్ వద్ద హిట్‌గా నిలిచింది. ఆ తర్వాత పలు భాషల్లో కూడా రీమేక్ అయింది. ప్రస్తుతం మిస్కిన్ ఈ బ్లాక్‌బస్టర్ సీక్వెల్‌పై పనిచేస్తున్నాడు. ఈ చిత్రంలో తమిళ నటి, గాయని ఆండ్రియా జెర్మియా లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ సీక్వెల్ పలు ఆర్థికపరమైన చిక్కులతో ఆలస్యమవుతూ వస్తోంది.ఇదిలా ఉంటే పిశాచి 2లో న్యూడ్ కంటెంట్ ఉండబోతుందని నెట్టింట పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఇదే విషయంపై క్లారిటీ ఇచ్చింది ఆండ్రియా. స్క్రిప్ట్ దశలో న్యూడిటి ఉండేది.. కానీ షూటింగ్ వరకు వచ్చే సరికి మిస్కిన్ సార్ ఆ పోర్షన్లను తీసేశారు. దానికి గల కారణమేంటనేది మాత్రం తనకు తెలియదని ఆండ్రియా చెప్పింది.పిశాచి 2లో న్యూడిటీ లేదు.. కానీ చాలా ఎరోటిక్ సీన్లుంటాయి. మిస్కిన్ సార్ ఈ సినిమాను మనుగడ (అస్తిత్వం)కోసం చేయడం లేదు. గతంలో ఆయన చాలా మంది పెద్ద హీరోలతో పనిచేశారు. అలాంటి డైరెక్టర్ ఓ పాత్ర కోసం నన్నేదైనా చేయాలని అడిగితే.. నేను ఆయన విజన్ నమ్మాలి. ఆయన ఉద్దేశం వేరే ఉంది. కొంతమంది నా స్కర్ట్‌ను కూడా కిందకి లాగమని అడిగారని చెప్పుకొచ్చింది. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.ఈ హార్రర్ చిత్రంలో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కామియో రోల్‌లో నటిస్తుండగా.. పూర్ణ, సంతోష్ ప్రతాప్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాక్‌ఫోర్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై టీ మురుగనంథం నిర్మిస్తున్న ఈ చిత్రానికి కార్తీక్ రాజా సంగీతం అందిస్తున్నాడు. టాలీవుడ్ నిర్మాత దిల్ రాజు తెలుగు రాష్ట్రాల్లో థియాట్రికల్ రైట్స్‌ను సొంతం చేసుకున్నారు.

## అనుష్క శర్మ డైట్ ప్లాన్ చూశారా..?

### ఏం తింటుందో తెలుసా..



బాలీవుడ్ బ్యూటీ అనుష్క శర్మ గురించి చెప్పక్కర్లేదు. హిందీలో బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో అలరించిన ఈ అమ్మడు.. ప్రస్తుతం ఇండస్ట్రీకి దూరంగా ఉంటుంది. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే క్రికెటర్ విరాట్ కోహ్లీని ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈ దంపతులకు బాబు, పాప ఉన్నారు.అనుష్క శర్మ తన ఫిట్నెస్, క్రమశిక్షణ లైఫ్ స్టైల్ తో ఎప్పుడూ అట్రాక్షన్ అవుతుంటుంది. ఆమె తరచూ తన ఆహారపు అలవాట్లతో అందరినీ ఆశ్చర్యపరుస్తుంటుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన భోజనం, ఆహారపు అలవాట్ల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది.గత ఆరు నెలలుగా తన బ్రేక్ ఫాస్ట్ కేవలం ఇడ్లీ సాంబార్ అని తెలిపింది. తన ఆహారపు అలవాట్లతోనే ఫిట్నెస్, వెయిట్ నియంత్రణ ఆధారపడి ఉందంటోంది. ప్రముఖ పోషకాహార నిపుణుడు డాక్టర్ ర్యాన్ ఫెర్నాండో అనుష్క ఫుడ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.ఆమె మోనోట్రోపిక్ డైట్ లేదా మోనో డైట్‌ను అనుసరిస్తుందని వివరించారు. ఒక వ్యక్తి ఒకే భోజనంలో ఒక ఆహార పదార్థం లేదా ఒక రకమైన ఆహారాన్ని మాత్రమే తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పండ్లు, పప్పు, బియ్యం, ఇడ్లీ సాంబార్ మాత్రమే తీసుకుంటారట.ఈ పద్దతి జీర్ణ ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుందని అన్నారు. ఒకేసారి ఒకే రకమైన ఆహారాన్ని తీసుకున్నప్పుడు జీర్ణవ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని అన్నారు. ఇది ఆమ్లత్వం, ఉబ్బరం లేదా అజీర్ణం వంటి తక్కువ సమస్యలకు దారితీస్తుందని తెలిపారు.